# మరువలేని ఒక రాత్రి



* రచన : శ్రీ కోసల్లె రామారావు *

అది కపిలవస్తు నగరము. సుశాక్యవంశ భానుడగు శుద్ధోదనమహారాజు పరిపాలించుచున్న కాలము. ప్రజలందరూ జాతిమత, కులవివక్షతల కలహములులేక, అన్ని మతములవారును అన్నదమ్ములవలె కలసి మెలగిన ఆనందయుగము.

రాజప్రసాదమునుండి సప్తాశ్వములు పూన్చిన బంగారు రథము ఖాళీగా పురవీధులవెంట బయలుదేరింది. మహారాజు అధిరోహించే ఆ రథం ఖాళీగా ఉన్నదేమియని ప్రజలంతా ఆశ్చర్యముతో చూస్తున్నారు. ఆ రథం కొంతసేపటికి రాజపురోహితులునూ, రాజగురువులునూ అగు విశ్వేశ్వరుల వారి భవనంముందు ఆగింది. రథసారథి చెన్నుడు రథముపైనుండి దుమికి లోనికేగి రాజగురువులకు నమస్కరించి—

ఆచార్యా, మహారాజ శుద్ధోధనులవారు తమరిని అత్యవసరముగా తోడ్కొనిరమ్మని నన్ను ఆదేశించారు. మీ కొరకు మహారాజులవారి ప్రత్యేక కాంచన రథమును పంపారు. తాము వెంటనే బయలుదేరమని ప్రార్థిస్తున్నాను అని విన్నవించాడు.

అత్యవసరమనిచో రాజు తనను పిలువనంపడని ఎరింగిన ఆచార్య విశ్వేశ్వరుడు వెంటనే రథమారోహించారు.

ఆ రథానికి పూన్చినవి మేలుజాతి అరబ్బీ అశ్వరాజములు. అవి రథమును క్షణములో రాజప్రసాదమును చేర్చినవి.

మహారాజు శుద్ధోధనుడు ఆచార్యుల[illegible] ఎదురేగి నమస్కరించి సాదరముగా తోడ్కొని దెచ్చి సువర్ణపీఠమును కూర్చుండుటకు చూపి, ఆచార్యులకు శ్రమనిచ్చితిని క్షమింపుడని కోరెను.

అనంతరము రాజు గురుదేవా-గడచిన రాత్రి మా పట్టపుదేవికి విచిత్రమయిన స్వప్నము వచ్చెనట. ఆ స్వప్నఫలము తెలుగుటకు ఆమె కోర్కెపై తమకు శ్రమగలుగజేసితినని తెలిపి పట్టపురాణి మాయాదేవిని పిలిపించగా ఆమె వచ్చి గురుదేవునికి నమస్కరించి, ఆచార్యాదేవా నిన్న పగలంతయూ మంగళగౌరి వ్రతము చేయుటలోనూ, పురాణశ్రవణముతోనూ గడచినది. రాత్రి మరల దైవము నర్చించి వుపవాసదీక్షలో నుంటిని గావున హంసతూలికా తల్పమును వర్జించి [illegible]కిందనే పరుంటిని ఎప్పుడు నిద్రించితినో సరిగా చెప్పలేను గాని ఆ నిద్రలో ఒక తెల్లని ఏనుగును గాంచితిని. ఆ ఏనుగు తన తొండములో ఒక పద్మమును తెచ్చి నా చుట్టునూ ముమ్మారు ప్రదక్షిణము చేసి ఆ పద్మమును నాచేతి కందించినది. ఇంతలో స్వప్నమునుంచి మేల్కొంటిని, అని చెప్పగా విని ఆచార్యుడు దివ్యదృష్టితో వీక్షించి పిమ్మట ఆనందముతో తల్లీ మాయాదేవీ, నీవు ధన్యవు. మీ దంపతుల

ప్రార్థనలను ఆదిదేవుడు విని మీకు సంతానముగా తానే జన్మించ నిశ్చయించుకొనెను. మీరు కృతార్థులు. మీ పూర్వపుణ్య విశేషమున సాక్షాత్ శ్రీమన్నారాయణుని పుత్రునిగా పొందగలుగుచున్నారని అనుచుండగా పట్టపు ఏనుగు పెద్దగా ఘీంకరించెను. తథాస్తు. అని పట్టపేనుగు ఆశీర్వదించుచున్నది చూచితివా రాజా యనగా మహారాజ దంపతులు రాజగురువుకు సాష్టాంగ ప్రణామ మాచరించగా, గురుదేవుడు వారిని సుపుత్ర ప్రాప్తిరస్తు, సర్వసౌఖ్య ప్రాప్తిరస్తని దీవించి అమూల్య బహుమానములతో సత్కరించబడి మరల బంగారు రథములో గృహమునకు పంపబడెను. సరిగా ఆ దినమునకు పదియవమాసమున మాయాదేవి సర్వశుభ సంపన్నమగు సమయమున ముద్దులు మూటగట్టు బంగారు బాలుని కనెను.

పుత్ర జననమునకు మిక్కిలి సంతోషముతో శుద్ధోదన మహారాజు రాజ్యమంతయూ పండ్రెండురోజులు ఉత్సవములు జరుప నాజ్ఞాపించి ధన, కనక, వస్తువాహనములతో విప్రులన సంఖ్యాకముగా సన్మానించెను. పన్నెండవరోజున రాజు బాలకుని జాతకమును తెలుసుకొనదలచి గొప్ప సభ చేసెను. ఎక్కడెక్కడి జ్యోతిష్కులందరూ ఆ సభకు ఆహ్వానింపబడిరి. వారందరూ బాలకుని దేహలక్షణములను పరిశీలించియూ, జాతక ఫలితములను గుణించియూ ఈ విధముగా నిర్ణయించిరి. మహారాజా ఈతడు మహాజాతకుడనునది నిర్వివాదాంశము. కానీ ఈతడు మహావీరుడై రాజ్యమును పరిపాలించునో! మహాజ్ఞానియై ప్రపంచప్రజలకు ముక్తిమార్గమును చూపునో తెలియుటలేదని విన్నవించారు. ఇంతలో ఒక పండ్రెండేండ్ల బ్రాహ్మణబాలకుడు నిలచి రాజా, ఈతడు తప్పక ముక్తిమార్గమునుపదేశించు మార్గదర్శకుడగును గానీ, ప్రాపంచిక లంపటుడు గాజాలడు అని ఖండితముగా చెప్పెను. 'బాల వాక్యం బ్రహ్మవాక్యం' అని అదే భవిష్యత్తులో నిజమయినది.

శుద్ధోధనుడు తన కుమారునికి సిద్ధార్థుడని నామకరణముగావించి అయిదేండ్లు నిండగనే తగు గురువుల వద్ద విద్యార్థిగా నియమించాడు. క్షాత్ర విద్యలగుము వీలు విద్య రణ విద్యలు తప్ప, సకల వేదశాస్త్రములయందుసూ తర్క, వ్యాకరణములయందునూ, ముఖ్యముగా ఆయుర్వేదమునందు మిక్కిలి పండితునిగా పదునారేండ్ల ప్రాయమునకే ఖ్యాతినందెను. హృదయవిదారక దృశ్యములు యువరాజు కంటపడకుండ రాజు కట్టడి చేసి తగు జాగ్రత్తలు గైకొనెను. సిద్ధార్థునికి పదునెనిమిదవ వత్సరము రాగానే అందాల భరిణెయగు యశోధర యను కన్యనిచ్చి వివాహం చేయబడినది. అయినప్పటికీ వేదాంతియగు సిద్ధార్థుడు భార్యామోహమున మునిగి లోక ప్రకృతిని ఏదో తెలియని భావముతో పరిశీలిస్తూ



# శ్రీ కృష్ణా ఐరన్ వర్క్స

తపాలు పెట్టె నెం. 103 మధురై.

మేము కట్టడములకు కావలసిన ఇనుము సామానులను తయారు చేయుదుము. స్ప్రింగు తలుపులు, కాంపౌండు తలుపులు, కొత్తరకాల కిటికీలు, వెంటిలేటర్లు గ్రాదులు ఇనుముట్రన్నులు, అద్దము కిటికీలు మొదలైన మా సామానులు ప్రసిద్ధి చెందినవి. 1935 సం॥ నుండి మునిసిపాలిటీలు, జిల్లాబోర్డులు, P. W. D. హైవేస్, పంచాయితీ బోర్డులు, మొదలైనవారికి కావలసిన సామానులను తృప్తికరముగా సప్లయి చేయుచున్నాము.

టెలిగ్రామ్స్: "IRONGATES" ఫోను: 2725

ఉండేవాడు. ఒకనాడు సిద్ధార్థుడు తండ్రిని దర్శించి నగరమును చూచి వచ్చుటకు అనుమతిని కోరాడు. కుమారుని కోరికను కాదనలేక అంగీకరించి మహారాజు మర్నాడు పురవీధులలో విచారకర దృశ్యములు యువరాజు కంటపడకుండునట్లు చూడవలసినదని భటుల నాజ్ఞాపించెను.

చెన్నుని సారథ్యంలో యువరాజు రథం నగరవీధులలో పరుగిడుతున్నది మధ్యలో యువరాజు, చెన్నని రాజమార్గంనుంచి మన రథమును సామాన్యవీధులలోనికి త్రిప్పుమని ఆదేశించాడు. యువరాజు ఆజ్ఞ పాటించడం తప్పని సరి అయింది చెన్ననకు. ఇంతలో ఒక వ్యక్తి అపరిమితమగు దగ్గుతో తలక్రిందులగుతూ నిలువలేక, కూర్చుండలేక యమబాధ పడుచుండగా చెన్నుని ఆ మనిషి ఎవరని ప్రశ్నించాడు సిద్ధార్థుడు. యువరాజా అతను ఒక క్షయరోగి అంతులేని దుర్వ్యసనములవలన అతను రోగగ్రస్తుడయి అట్లు బాధపడుచుండెనని సమాధానమిచ్చెను. మరికొంతదూరము రథము సాగగా ఒక పండుముసల నడుము వంగిపోయి చేతికఱ్ఱ సహాయముతో అతి కష్టముతో నడచుచుండెను. అని సమాధానమిచ్చాడు మరికొంతదూరము రథముసాగగా ఒక పండు ముసలి వంగిపోయి చేతి కర్రసహాయముతో అతికష్టముతో నడచుచుండెను. అపుడు చెన్నుడు సిద్ధార్థునితో, యువరాజా అతను ఒక వృద్ధుడు. యవ్వనము చెల్లిపోయి వార్ధక్యములో అడుగిడినవారందరునూ ఇట్లే యగుదురని చెప్పెను. యువరాజు మనస్సంతయూ వికలమయ్యెను. చెన్నా ఇంక రథమును మన భవనమునకు త్రిప్పుమని ఆదేశించెను. రథము నడచుచుండగా ఒక వృద్ధురాలి శవముపైబడి ఆమె బంధువులు ఏడ్చుచుండుట చూచి సిద్ధార్థుడు ఇది యేమని చెన్నుని ప్రశ్నించెను. ప్రభూ, ప్రతివ్యక్తియూ శరీరమందలి శక్తి తగ్గిన యనంతరము ఆ వృద్ధ స్త్రీవలె మృత్యువాత పడవలసినదియె యని సమాధానమిచ్చెను. యువరాజు సిద్ధార్థుని మనస్సంతయూ ఆలోచనలతో అల్లకల్లోల మయ్యెను. ఇంతలో రథము రాజభవనమును చేరినది.

ఆ రాత్రి సిద్ధార్థునకు భోజనము రుచించలేదు. భార్య యశోధర అందమగు మోము, బింకమగు శరీరమునూ అతనికి మోహమును కలిగించలేదు. కుమారుడయిన బాలరాహులుని చిరునవ్వు సిద్ధార్థుని మురిపించలేదు. చెన్నుడు చెప్పినమాటలే మనస్సులో మెదలసాగెను. తాను కన్నులారా చూచిన విచారదృశ్యములు జ్ఞప్తికివచ్చి యువరాజు తల్లడిల్లెను. ప్రతిమానవుడునూ రోగములచే పీడించబడుచు దేహపటుత్వము కోల్పోయి వృద్ధుడయి చివరకు మరణించవలసినదియేనా? వీటికి తరుణోపాయము లేదా? మానవుడు సుఖించుమార్గమేమో తెలుసుకొనవలెనని నిశ్చయించుకొనెను. తోడనే అతడు తనుధరించిన ఆభరణములను విసర్జించెను. చీనిచీనాంబరములను విడిచి సామాన్యమగు కాషాయవస్త్రములను ధరించెను. హంసతూలిక తల్పముపై పడుకొని నిద్రించుచున్న యశోధరకు సిద్ధార్థుని మనస్సులో చెలరేగుచున్న భావములు తెలియవు. అమాయకుడగు రాహులుని ప్రశాంతమగు ముఖమును చూచినచో తన మనస్సు మారునేమో యను భీతిచే సిద్ధార్థుడు వడివడిగా రాజభవనమును వీడి పాదచారియై నిర్వాణమార్గమును కనుగొనుటకు ఆ అర్ధరాత్రి సమయమున బయలుదేరెను. ఆ రాత్రియే మనకు ముక్తిమార్గము తెలుసుకొనుటకు తోడ్పడిన రాత్రి. చరిత్రలో ఒక మరువలేని మఱపురాని రాత్రి.

అందానికీ
మన్నికకూ -




జయప్రకాష్ బనియన్లనే
వాడి సంతృప్తి పొందండి
*
జయప్రకాష్ హొయిసరీస్
తిరుపూరు - 2.